సోమవారం సెక్రటేరియట్ ముట్టడికి వచ్చిన రాజారాం యాదవ్, జంగయ్య తదితరులను అడ్డుకుంటున్న పోలీసులు

చిక్కడపల్లిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీ వద్ద నిరుద్యోగులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

లోకం పోకడ

పోలీసులు నిరుద్యోగుల్ని అరెస్టు చేయడంలో బిజీ.. మనం మన ఉద్యోగం చేసుకుందాం పదా!

సెక్రటేరియట్ ముట్టడి సక్సెస్

- ధర్నాలతో దద్దరిల్లిన సచివాలయం
- డీఎస్సీ వాయిదా, గ్రూప్స్ పోస్టులు పెంచాలని నిరుద్యోగుల డిమాండ్
- బీసీ కులగణన కోసం బీసీ జనసభ
- స్కాలర్‌షిప్‌ల కోసం ఏఐఎస్‌ఎఫ్
- అరెస్టులు.. ఠాణాలకు తరలింపు
- రాష్ట్రమంతటా నేతల నిర్బంధాలు

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఓవైపు నిరుద్యోగులు, మరోవైపు విద్యార్థి సంఘాలు, ఇంకోవైపు బీసీ నేతల ముప్పేట ముట్టడితో సచివాలయం, చుట్టుపక్కల ప్రాంతాలు సోమవారం దద్దరిల్లాయి. డీఎస్సీ వాయిదా, జాబ్ క్యాలెండర్ విడుదల, గ్రూప్స్ పోస్టుల పెంపు డిమాండ్లతో నిరుద్యోగులు, రాష్ట్రంలో బీసీ కులగణన, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం బీసీ జనసభ నేతలు, రూ.8వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు సెక్రటేరియట్‌ను ముట్టడించారు. వరుస ధర్నాలు, దిక్కులుపిక్కటిల్లేలా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో సచివాలయం ప్రాంతం హోరెత్తింది. వేలాది మంది కదంతొక్కడంతో సెక్రటేరియట్ వద్ద రోజంతా ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ముట్టడి నేపథ్యంలో పోలీసులు సచివాలయం చుట్టూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున బారికేడ్లు పెట్టారు. నిరుద్యోగులను ఎక్కడికక్కడ అడ్డుకునేందుకు సచివాలయానికి వచ్చే అన్ని మార్గాల్లో సుమారు 100 మీటర్ల మేర వందలాదిమంది సివిల్, స్పెషల్ పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది మోహరించారు. అష్ట దిగ్బంధాన్ని ఛేదించుకుంటూ

భూదాన్‌పోచంపల్లి పోలీసుల అదుపులో బీఆర్‌ఎస్‌వీ నాయకులు

ఆయా సంఘాల నాయకులు, విద్యార్థులు సెక్రటేరియట్‌లోకి చొచ్చుకెళ్లే ప్రయత్నంలో పోలీసులు, నిరసనకారుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో రాజారాం యాదవ్‌తో పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. నిరసన తెలిపినవారిని వాహనాల్లోకి ఎక్కించి పోలీసుస్టేషన్లకు తరలించారు.

డీఎస్సీ వాయిదా వేయాల్సిందే..

డీఎస్సీ వాయిదా వేయాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో పిలవాలని, గ్రూప్-2, 3 పోస్టులు పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. 'వీ వాంట్ జస్టిస్', 'సీఎం డౌన్ డౌన్' అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. సచివాలయం ఆగ్నేయం గేటు వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు నల్లపోచమ్మ గుడి వైపు నుంచి కొందరు నిరుద్యోగులు సచివాలయం ముట్టడికి యత్నించగా అరెస్ట్ చేసి, పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ముట్టడికి ఓయూ నుంచి బయలుదేరిన నిరుద్యోగులను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్, ఇతర నాయకులను ఉప్పల్‌లో అదుపులోకి తీసుకున్నారు. చిక్కడపల్లి లైబ్రరీ నుంచి నిరుద్యోగులు ర్యాలీ తీసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

కులగణన చేపట్టాలి

రాష్ట్రంలో బీసీ కులగణన వెంటనే చేపట్టాలనే డిమాండ్‌తో బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ ఆధ్వర్యంలో సెక్రటేరియట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా పోలీసులు ఆయనను ముందస్తు అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. సెక్రటేరియట్ వద్ద రాజారాం యాదవ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు, రాష్ట్రంలో పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో విద్యార్థులు సచివాలయం ముట్టడికి ర్యాలీగా వస్తుండగా అరెస్ట్ చేశారు. కాగా, పోలీసులు సచివాలయం చుట్టూ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నల్లపోచమ్మ గుడి నుంచి సచివాలయంలోకి వచ్చే రోడ్డును పూర్తిగా మూసేశారు. చుట్టూ అదనంగా బారికేడ్లు పెట్టి అదనపు బలగాలను మోహరించారు. నిరసనకారులను పోలీస్‌స్టేషన్లకు తరలించేందుకు పదుల సంఖ్యలో వాహనాలను సిద్ధంగా ఉంచారు. వచ్చినవారిని వచ్చినట్టే అరెస్ట్ చేస్తూ ఠాణాలకు తరలించారు. సచివాలయం వైపు వచ్చే మార్గాల్లో 100 మీటర్ల వరకు ప్రధాన కూడళ్లలో పోలీసులు గుంపులుగా పహారా కాశారు.

ప్రభుత్వ పతనం ప్రారంభం: రాజారాంయాదవ్

ఖైరతాబాద్: సెక్రటేరియట్ వద్ద ధర్నాలో రాజారాంయాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు, నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ఎన్ని నిర్బంధాలు విధించినా నిరుద్యోగుల సమస్య పరిష్కారమయ్యేదాకా పోరాడుతామని స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పతనం ప్రారంభమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు.

రాష్ట్రమంతటా అరెస్టుల పర్వం

రాష్ట్రమంతటా ఆదివారం అర్ధరాత్రి నుంచే నిరుద్యోగ, విద్యార్థి, బీసీ సంఘాల నేతల అరెస్టులు కొనసాగాయి. బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డ్యాగల శ్రీనివాస్‌ను నర్సంపేటలో, గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాయంచు నాగరాజును ములుగులో అరెస్టు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా సహా మిర్యాలగూడ, దేవరకొండ, నార్కట్‌పల్లి, దామరచర్ల, శాలిగౌరారం, తిర్మలగిరిసాగర్, త్రిపురారం, మాడ్గులపల్లి, సంస్థాన్ నారాయణపురం, మోత్కూర్, సూర్యాపేట, నాగారం, భీమారం, యాదాద్రిభువనగిరి, గుండాల, అడ్డగూడూర్, భూదాన్‌పోచంపల్లి, నడిగూడెం, తుంగతుర్తితో పాటు పలుచోట్ల వివిధ సంఘాల నేతల అరెస్టులు కొనసాగాయి.

నిరుద్యోగులు టెర్రరిస్టులా?

బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ చెప్పేదొకటి చేసేదొకటి అని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ఆరోపించారు. ప్రజలను తప్పుదారి పట్టించి పబ్బం గడపాలని కాంగ్రెస్ సర్కారు చూస్తున్నదని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాము ఏ నిర్ణయం తీసుకున్నా నాలుగు గోడల మధ్య ఉండదని, ప్రజల మధ్యే తీసుకుంటామని స్వయంగా ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు చెప్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అయితే, ఆ సిద్ధాంతం నిరుద్యోగులకు వర్తించదా? అని ఆయన ప్రశ్నించారు. తమ నిర్ణయాలు ప్రజల్లోనే ఉంటాయని చెబుతున్న సర్కారు ఓయూలో, దిల్‌సుఖ్‌నగర్‌లో, అశోక్‌నగర్‌లో నిరుద్యోగులు చేస్తున్న నిరసన ప్రదేశాలకు ఎందుకు వెళ్లటంలేదని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఓట్ల కోసం అశోక్‌నగర్, చిక్కడపల్లి చుట్టూ తిరిగినవారు ఇప్పుడెందుకు వెళ్లరని ఆయన ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి వెళ్లకపోయినా కనీసం ఓ మంత్రిని, ఎమ్మెల్యేనైనా ఎందుకు పంపటంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సెక్రటేరియేట్ ముట్టడికి పిలుపునిస్తే వందలాది మంది పోలీసులను రప్పించారని, నిరుద్యోగులేమైనా టెర్రరిస్టులా? అని ప్రశ్నించారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నిజామాబాద్	33.3°c	24.6°c
ఆదిలాబాద్	32.4°c	25.1°c
రంగారెడ్డి	30.2°c	21.7°c
ఖమ్మం	30.0°c	25.0°c
మెదక్	29.7°c	22.5°c
కరీంనగర్	29.0°c	25.0°c
వరంగల్	29.0°c	24.0°c
నల్లగొండ	28.5°c	22.0°c
హైదరాబాద్	28.0°c	22.6°c
మహబూబ్‌నగర్	25.6°c	23.1°c

ఐదు రోజులు భారీ వర్షాలు!

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రాబోయే ఐదు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని వాతావరణ శాఖ వెల్లడించింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, దీని ప్రభావంతో వర్షాలు కురువొచ్చని తెలిపింది. మరో వారం రోజుల్లో ఇంకో అల్పపీడనం ఏర్పడొచ్చని, కాబట్టి ఈ నెల 25 వరకూ వర్షాలు పడొచ్చని అంచనా వేసింది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా సోమవారం మంచిర్యాల, జయశంకర్-భూపాలపల్లి, వికారాబాద్, సంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసింది. మంచిర్యాల జిల్లా వేమనపల్లిలో అత్యధికంగా 13.86 సెంటీమీటర్ల (సెం.మీ) వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌లోని మారేడుపల్లిలో 6.73 సెం.మీ. వర్షం కురిసింది. కాగా, ఈ ఏడాది జూన్ 1 నుంచి జూలై 15 (సోమవారం) వరకు రాష్ట్రంలో 258.6 మిల్లీమీటర్ల (మి.మి) వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. గత ఏడాది ఇదే సమయానికి 189.5 మిల్లీమీటర్లు నమోదైంది. అయితే ఇప్పటికీ దాదాపు 102 మండలాల్లో లోటు వర్షపాతం ఉన్నది.

నాడు ఓట్లు కొల్లగొట్టిండ్రు నేడు వీపులు పగలగొడుతున్నరు

- చిక్కడపల్లిలో విద్యార్థులపై పోలీసుల దాడి పాశవికం
- ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి
- మాజీ మంత్రి హరీశ్ మండిపాటు

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీలో గ్రూప్స్, డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగులపై ప్రభుత్వం పాశవికంగా ప్రవర్తించడం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. 'ఇదేనా ప్రజాపాలన అంటే, ఇదేనా ఇందిరమ్మ రాజ్యమంటే..?' అని ప్రశ్నించారు. ఆనాడు సిటీ సెంట్రల్ లైబ్రరీకి రాహుల్ గాంధీని తీసుకువెళ్లి ఓట్లు కొల్లగొట్టారని, నేడు అదే లైబ్రరీకి పోలీసులను పంపించి విద్యార్థుల వీపులు పగలగొడుతున్నారని ధ్వజమెత్తారు. చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీలో విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాన్ని సోమవారం ఎక్స్ వేదికగా హరీశ్ తీవ్రంగా ఖండించారు. విద్యార్థులపై దమనకాండను ప్రభుత్వం వెంటనే ఆపాలని, ఘటనకు బాధ్యత వహించి ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సీఎం రెచ్చగొట్టడం వల్లే: ఎర్రోళ్ల

విద్యార్థులను అవమానిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు రెచ్చగొట్టేలా మాట్లాడడం వల్లే విద్యార్థులు రోడ్లపైకి వచ్చారని బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆరోపించారు. నిరుద్యోగులు, విద్యార్థుల అరెస్టును ఆయన ఖండించారు. హైదరాబాద్‌లో ఎటు చూసినా ముండ్లు, ఇనుప కంచెలతో సమైక్యపాలనలో ఉద్యమ రోజులను తలపిస్తున్నదని చెప్పారు. నిరుద్యోగులు సచివాలయం ముట్టడికి పిలుపునిస్తే వారిని పిలిచి చర్చలు జరపకుండా యూనివర్సిటీ విద్యార్థులు, నిరుద్యోగులు, ముదిరిపోయిన బెండకాయలని ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుచేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటం తగదని సూచించారు. నిరుద్యోగులు కోరుతున్నట్టుగా డీఎస్సీ వాయిదా వేసి పరీక్షల మధ్య వ్యవధి పెంచాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల పోరాటానికి బీఆర్‌ఎస్ మద్దతు ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.

నిరుద్యోగుల సమస్యలపై అఖిలపక్షాన్ని పిలవండి

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న నిరుద్యోగులపై ప్రభుత్వ నిర్బంధం సరైంది కాదని, వారి సమస్యల పరిష్కారం కోసం వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని పిలువాలని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఓ లేఖను విడుదల చేశారు. అఖిలపక్ష సమావేశంలో నిరుద్యోగుల సమస్యలపై చర్చించి పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. గ్రూప్-1లో 1:100, గ్రూప్-2, 3 పోస్టులను పెంచడం, డీఎస్సీ వాయిదా, టీచర్ పోస్టులు తదితర అంశాలపై చర్చిస్తే తప్పకుండా పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

'మొండి వైఖరి వీడాలి'

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): పరీక్షలపై ఆందోళన చేస్తున్న నిరుద్యోగులతో చర్చలు చేయకూడదనే నియంతృత్వ వైఖరిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడనాడాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ చక్రధరరావు, కార్యదర్శులు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. నిరుద్యోగులు తమ డిమాండ్లపై పోరాటం చేస్తున్నా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్చలకు పిలవకపోవడం గర్హనీయమని అభిప్రాయపడ్డారు. ఉద్యమంలో ప్రతిపక్ష పార్టీలు ఉన్నాయనే పేరుతో నిరుద్యోగులను అరెస్టు చేయడం, బారికేళ్లు, ముళ్లకంచెలు ఏర్పాటు చేసి నిర్బంధాన్ని ప్రయోగించడం నియంతృత్వ ప్రభుత్వ లక్షణం అన్నారు. ప్రభుత్వం నిరుద్యోగులతో చర్చలు జరుపాలని, పరీక్షల వాయిదా విషయాన్ని పరిశీలించాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది.

శాంతియుత ఆందోళన నిషేధమా?

- నిరుద్యోగ యువతపై సర్కారు దుర్మార్గం
- విద్యార్థి నాయకులను విడుదల చేయాలి
- ప్రభుత్వం ఇలాగే మొండికేస్తే పోరాటం
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగ యువకులు తమ డిమాండ్ల సాధన కోసం ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. నిరుద్యోగ యువకుల సమస్యలను సానుకూల దృక్పథంతో నెరవేర్చాల్సింది పోయి నిర్బంధం పెడతూ అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల డిమాండ్ల పరిష్కారం కోసం సెక్రటేరియట్ ముట్టడికి ప్రయత్నించిన రాజారాంయాదవ్ సహా ఇతర విద్యార్థి నాయకులను అరెస్ట్ చేయడాన్ని ఆయన ఒక ప్రకటనలో ఖండించారు. అధికారంలోకి రాగానే నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తామని నమ్మబలికిన సర్కార్ ఇప్పుడు వారిని గాలికి వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకురావడం ప్రజాపాలనలో నిషేధమా? అని ప్రశ్నించారు. గత కొన్ని రోజులుగా విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల ప్రభుత్వం అణచివేత ధోరణి అవలంబిస్తున్నదని, ఇది సరికాదని హెచ్చరించారు. పోలీసులు అరెస్ట్ చేసిన రాజారాంయాదవ్ సహా మిగతా విద్యార్థి నాయకులందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ వారిని పట్టించుకోవడం మానేసిందని విమర్శించారు. విద్యార్థులు, నిరుద్యోగులు చేస్తున్న డిమాండ్లను పరిష్కరించకుంటే ఏ నిరుద్యోగులను రెచ్చగొట్టి గద్దెనెక్కారో వాళ్లే ఈ ప్రభుత్వ పతనాన్ని శాసిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇలాగే మొండి వైఖరితో ముందుకెళ్తే బీఆర్‌ఎస్ తరఫున పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని కేటీఆర్ హెచ్చరించారు.



ధర్నాకు అనుమతించాలని న్యూఢిల్లీ డీసీపీకి వినతిపత్రం అందజేస్తున్న మోతీలాల్‌నాయక్

ఢిల్లీకి చేరిన ఉద్యమం

- నేడు జంతర్‌మంతర్‌లో నిరుద్యోగుల ధర్నా
- 'రేవంత్‌రెడ్డి హటావో.. తెలంగాణ బచావో' నినాదంతో మోతీలాల్‌నాయక్ పోరాటం

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని నిరుద్యోగుల ఉద్యమం దేశ రాజధాని ఢిల్లీకి చేరింది. గల్లీలోని కాంగ్రెస్ సర్కారు పట్టించుకోకపోవడంతో ఢిల్లీ కాంగ్రెస్‌కు తమ తడాఖా చూపేందుకు నిరుద్యోగులు ఢిల్లీ వెళ్లారు. రేవంత్ సర్కారు తీరును ఢిల్లీ వేదికగా ఎండగట్టేందుకు రాహుల్‌గాంధీ ఇంటి ముట్టడికి పిలుపునిచ్చారు. మంగళవారం ఢిల్లీ జంతర్‌మంతర్‌లో ధర్నా నిర్వహించనున్నారు. నిరుద్యోగ జేఏసీ నేత మోతీలాల్‌నాయక్ నేతృత్వంలోని 30 మంది ప్రతినిధుల బృందం సోమవారం ఢిల్లీకి చేరింది. జంతర్‌మంతర్‌లో ధర్నాకు అనుమతినివ్వాలని న్యూఢిల్లీ డీసీపీని కలిసి వినతిపత్రాన్ని సమర్పించగా వీరిలో కొందరు రాహుల్‌గాంధీ ఇంటి ముట్టడికి పిలుపునిచ్చారు. జంతర్‌మంతర్‌లో ధర్నా, రాహుల్‌గాంధీ ఇంటి ముట్టడిని విజయవంతం చేయాలని జేఏసీ నేతలు కోరారు. ధర్నాకు ఢిల్లీ పోలీసులు అనుమతినిచ్చినట్టు మోతీలాల్‌నాయక్ తెలిపారు. 'రేవంత్‌రెడ్డి హటావో.. తెలంగాణ బచావో' అనే నినాదంతో పోరాటాన్ని ఉధృతం చేస్తామని, డిమాండ్లు నెరవేరేదాకా ఢిల్లీ దద్దరిల్లేలా ఉద్యమిస్తామని స్పష్టంచేశారు. దశలవారీగా నిరుద్యోగులు ఢిల్లీకి వస్తారని, జంతర్‌మంతర్‌లో ధర్నా చేస్తారని, ఢిల్లీలో పోరాటం నిరంతరాయంగా కొనసాగుతుందని చెప్పారు.

రేవంత్ సర్కారు స్పందన లేకనే..

పరీక్షలు రాయనివారే దీక్షలు చేస్తున్నారంటూ సీఎం రేవంత్‌రెడ్డి అవమానించడంతో ఆగ్రహించిన నిరుద్యోగులు శనివారం రాత్రి చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, అశోక్‌నగర్‌లో తెల్లవారేదాకా నిరసన కొనసాగించారు. సీఎం రేవంత్‌రెడ్డికి కౌంటర్‌గా మోతీలాల్‌నాయక్ గ్రూప్ -1, గ్రూప్ -4 హాల్‌టికెట్లను బహిర్గతం చేశారు. అశోక్‌నగర్‌లో పోలీసుల బందోబస్తు నేపథ్యంలో నిరుద్యోగులు దిల్‌సుఖ్‌నగర్‌ను వేదికగా చేసుకొని ఆదివారం రాత్రి మెట్రోపిల్లర్ల కింద ఆందోళన చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దిగిరాకపోవడంతో ఇక ఢిల్లీలోనే తేల్చుకోవాలని నిర్ణయించారు.

నిర్బంధంలో నిరుద్యోగి

- సిటీ సెంట్రల్ లైబ్రరీలో రణరంగం
- గ్రూప్స్ పోస్టుల పెంపు కోసం ఆందోళన
- ర్యాలీకి అనుమతి ఇవ్వని పోలీసులు
- గేటు దాటి రాకుండా ఆంక్షలు
- వచ్చినవారిని వచ్చినట్టే అరెస్టు
- వార్త కవరేజీకి వెళ్లిన జర్నలిస్ట్ అరెస్ట్

చిక్కడపల్లి, జూలై15 : ప్రశాంతంగా ఉండే చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ సోమవారం రాత్రి రణరంగాన్ని తలపించింది. నిరుద్యోగుల ఆందోళనలు, పోలసుల అరెస్టులతో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. గ్రూప్-2,3 పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు సిటీ సెంట్రల్ లైబ్రరీ వద్ద నిరసన తెలిపారు. శాంతియుతంగా ర్యాలీ తీస్తామని పోలీసులను కోరినా నిరాకరించారు. ప్రధాన గేటు దాటి బయటకు వస్తే అరెస్టు చేస్తామని హెచ్చరించారు. లైబ్రరీ నుంచి బయటకు వచ్చేందుకు యత్నించిన 20 మందిని అరెస్టు చేసి చాంద్రాయణగుట్ట, బొల్లారం పోలీస్ స్టేషన్లకు తరలించారు. వీరిలో ఇద్దరు మహిళా అభ్యర్థులున్నారు.

అభ్యర్థుల్లో భయంభయం

ఓవైపు గేటు బయటకు వెళ్తున్న నిరుద్యోగులను పోలీసులు అరెస్టు చేస్తుంటే మరోవైపు లోపల ఉన్న వారు ఆందోళన కొనసాగించారు. గ్రూప్ 2,3 పోస్టులు పెంచాలని, డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. 'సీఎం డౌన్‌డౌన్', 'గుంపు మేస్త్రీ డౌన్ డౌన్' అంటూ గర్జించారు. దీంతో పోలీసులతో పాటు స్పెషల్ టీం పోలీసులు గేటు లోపలికి వెళ్లి నిరసనకారులను అరెస్ట్ చేశారు. పోలీసులు దూసుకురావడంతో అభ్యర్థులు భయభ్రాంతులకు లోనై లోపలికి వెళ్లి లైబ్రరీ భవనం గ్రిల్ వేసుకున్నారు. లైబ్రరీలోనికి పోలీసులు ఎలా వస్తారని నిలదీశారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో అభ్యర్థులు భోజనం చేసేందుక అనుమతించారు. బయటకు వెళ్తున్నవారిలో ఆందోళన చేస్తున్న వారిని గుర్తించి అరెస్టు చేశారు.

జర్నలిస్ట్ అరెస్టు

సిటీ సెంట్రల్ లైబ్రరీ బయట యూట్యూబ్ చానల్ జర్నలిస్ట్ మహిపాల్ యాదవ్ కవరేజ్‌లో భాగంగా అభ్యర్థులతో మాట్లాడుతుంటే అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తాను రిపోర్టర్‌నని చెప్పినా వినిపించుకోలేదు. ఈ విషయంపై వివిధ చానళ్ల ప్రతినిధులు ఇన్‌స్పెక్టర్‌ను అడుగగా 'మా పనికి అడ్డు వచ్చిన వారిని అరెస్టు చేస్తాం' అని దురుసుగా సమాధానమిచ్చారు.

నియంతృత్వ ధోరణి నశించాలి: జంగయ్య

కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ ధోరణి నశించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి వీ జంగయ్య మండిపడ్డారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి ఓట్లు దండుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకుని.. ఇప్పుడు కనీసం వారితో మాట్లాడే ఆలోచనలో కూడా లేని దౌర్భాగ్యపు స్థితిలో ప్రభుత్వం ఉన్నదని దుయ్యబట్టారు. నిరుద్యోగులు ఇంత ఆందోళన చేస్తున్నా దున్నపోతు మీద వాన పడ్డట్టు వ్యవహరించడం అత్యంత సిగ్గుచేటని విమర్శించారు.

నిరుద్యోగులు ఉగ్రవాదులా?

ఆ మేధావులు ఇప్పుడేందుకు మాట్లాడ్తలేరు?: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : అధికారం కోసం నిరుద్యోగులను వాడుకున్న కాంగ్రెస్, ఇప్పుడు వారిని ఉగ్రవాదుల్లా చూస్తున్నదని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సచివాలయం, ఉస్మానియా యూనివర్సిటీ చుట్టూ పోలీస్ బలగాలను దించారని, నిరుద్యోగులేమైనా ఉగ్రవాదులా? అని ప్రశ్నించారు. రేవంత్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఇండ్ల చుట్టూ తిరిగి కండువాలు కప్పుతున్నారని విమర్శించారు. కేవలం డీఎస్సీ వాయిదానే నిరుద్యోగులు అడుగుతున్నారని, గ్రూప్-2, 3 పోస్టులు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. 'గ్రూప్ -1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేయాలని అసెంబ్లీలో భట్టి డిమాండ్ చేయలేదా? నిరుద్యోగుల వద్దకు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గేను తీసుకెళ్లి చిలకపలుకులు పలికించలేదా? అని ప్రశ్నించారు. నిరుద్యోగులపై ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతున్నదని, సీఎం అహంకార పూరిత మాటలపై మేధావులు ఎందుకు స్పందించడం లేదని? ప్రొఫెసర్ కోదండరాం, ఆకునూరి మురళి, ప్రొఫెసర్ నాగేశ్వర్ ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. కోచింగ్ సెంటర్ల నిర్వాహకులను సీఎం విమర్శిస్తే ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. నిరుద్యోగుల సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో పోరాడుతామని ఇప్పటికే కేటీఆర్ ప్రకటించారని చెప్పారు. నిరుద్యోగులను పెయిడ్ ఆర్టిస్టులుగా చిత్రీకరిస్తున్నారని, నిరుద్యోగుల సమస్యలపై కమ్యూనిస్టులు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అరెస్టు చేసిన నిరుద్యోగులందర్నీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులది కృత్రిమ ఉద్యమం

- నిరసనల వెనుక రాజకీయ ప్రోద్బలం
- త్వరలో 9వేల పోస్టులతో మరో డీఎస్సీ
- అన్నిరంగాల్లో 30 లక్షల ఉద్యోగాలు భర్తీ
- ప్రజాభవన్‌కు వచ్చి నిరసన తెలపండి
- ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయకండి
- ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

హైదరాబాద్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : కొందరు రాజకీయ నాయకులు డబ్బు ఖర్చు చేసి నిరుద్యోగులతో కృత్రిమ ఉద్యమాలు చేయిస్తున్నారని, దీని వెనుక రాజకీయ ప్రోద్బలం ఉన్నదని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఆరోపించారు. సచివాలయంలోని మీడియా పాయింట్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ అధికారంలోకొచ్చిన ఏడాదిలోపు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఈ మేరకు ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. గ్రూప్ వన్ నోటిఫికేషన్, మెయిన్స్ షెడ్యూల్ కూడా ఇచ్చామని గుర్తుచేశారు. రాష్ట్రంలో 20 వేల ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. తాము ఒకేసారి 20వేల పోస్టులు భర్తీ చేస్తే నాణ్యమైన అభ్యర్థులు దొరకరనే ఉద్దేశంతో మొదట 11 వేలకు పైగా పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చామని తెలిపారు. మిగతా 9వేల పోస్టులతో మరో నోటిఫికేషన్ వేస్తామని చెప్పారు. కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు విద్యార్థులను ప్రేరేపించి ఆందోళన చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఇంటికి వెళ్లి ధర్నా చేయొద్దని, అవసరమైతే ప్రజాభవన్‌కు వచ్చి నిరసన తెలపాలని కోరారు. ప్రజావాణిలో చేసే దరఖాస్తులకు ఫలితాలు కూడా వస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయొద్దని కోరారు.